క్లుప్తంగా

కోచ్‌లు, పీడీల సదస్సుకు ఆదర్శ్‌కుమార్

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్ల సదస్సుకు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ హాజరయ్యారు. ఆల్‌ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యాన ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల్లో శిక్షణ, కల్పించాల్సిన వసతులపై చర్చించారు.

వైద్యసేవలు వినియోగించుకోండి

కామేపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కామేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శిరీష అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీకి వచ్చేవారి వివరాలను ఈహెచ్‌ఎంఐఎస్ పోర్టర్‌లో నమోదు చేయాల్సి ఉన్నందున తమ వెంట ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు.

విద్యార్థులకు డీఈఓ అభినందన

ఖమ్మం సహకారనగర్: ఎస్సెస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మమత రోడ్‌లోని శ్రీచైతన్య ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు మంగళవారం డీఈఓ సామినేని సత్యనారాయణను కలవగా ఆయన పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం చేతన్ మాదూర్, ప్రిన్సిపాల్ శర్మ, రామకృష్ణారెడ్డి, కృష్ణారావు, కేవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీ లీజ్ రద్దు చేయాలని దీక్ష

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో దళితుల భూములను గ్రానైట్ క్వారీ నిర్వహణకు లీజ్‌గా ఇవ్వడంపై పలువురు అభ్యంతరం తెలిపారు. ఈమేరకు క్వారీ వద్ద మంగళవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నందిగామ విద్యాసాగర్ తదితరులు మాట్లాడుతూ దళితుల భూములపై నోటీసులు ఇవ్వకుండా క్వారీకి ఇవ్వడం సరికాదన్నారు. తమ భూములకు పట్టాలు రాకుండా కొందరు అడ్డుకున్నారని, ఇప్పుడు రెవెన్యూ అధికారులు ఎన్‌ఓసీ జారీ చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. ఈ దీక్షలో వెంకటరత్నం, నాగేశ్వరరావు, అబ్రహం, జయమ్మ, ఉప్పలి, రవి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కామేపల్లి: కశ్మీర్ ఉగ్రదాడిని ఖండిస్తూ కామేపల్లి బీజేపీ మండలాధ్యక్షుడు జర్పుల రామారావు ఆధ్వర్యాన మంగళవారం తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రాన్ని అందించారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాలకు చెందిన వారిని దేశం నుంచి వెంటనే పంపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్యా శ్రీనునాయక్, బాగం రంగారావు, పోలూరి రామచంద్రయ్య, క్రిష్ణనాయక్, అజ్మీరా సెట్యానాయక్, నల్లమోతు పిచ్చయ్య, కొమ్మినేని భద్రయ్య, అమిరినేని వెంకటేశ్వర్లు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

16న కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు తదితర స్థానిక సమస్యల పరిష్కారానికి ఈనెల 16న కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ తెలిపారు. మంగళవారం ఖానాపురం హవేలి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 16న లబ్ధిదారులందరూ వ్యక్తిగత దరఖాస్తులతో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నాకు హాజరుకావాలన్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో డ్రెయినేజీలు, రోడ్లు, వంతెనల సమస్యలపై అధికారులపై ఒత్తిడి చేస్తామన్నారు. అనంతరం మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు మాట్లాడగా.. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు పిన్నింటి రమ్య, డివిజన్ కమిటీ సభ్యులు పోతురాజు వెంకటి, కత్తుల అమరావతి, గాలి వెంకటాద్రి, మండల కమిటీ సభ్యులు అంజయ్య, ప్రసాద్, మంగమ్మ, శ్రీను, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్
వినోద	రెట్రో, జింకానా
సాయిరాం	తండర్‌బోల్ట్స్
ఆదిత్య	జింకానా, అర్జున్ వైజయంతి
శ్రీనివాస	హిట్: ది థర్డ్ కేస్

- ఖమ్మంగాంధీచౌక్

ఎండుతున్న పచ్చతోరణం

మొక్కల సంరక్షణపై పట్టింపు కరువు
- నాటడం లక్షల్లో.. బతికేవి వేలల్లోనే
- అలంకారప్రాయంగా నర్సరీలు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



ముచ్చర్ల స్టేజీ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఎండిపోతున్న మొక్కలు

కామేపల్లి: పచ్చదనం, అడవుల విస్తీర్ణం పెంచాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం హరితహారాన్ని ప్రవేశపెట్టగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమంగా మార్పు చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామ పంచాయతీలో వన నర్సరీలు ఏర్పాటు చేసి పెంచిన మొక్కలను గ్రామాల్లోని రోడ్లకిరువైపులా నాటారు. కానీ నాటిన మొక్కలకు నీరు పోయకపోవడం, వాటి సంరక్షణను పట్టించుకోకపోవడంతో అవి ఎండిపోయాయి. ఇంకా కొంత మంది రైతులు తమ పంట పొలాల పక్కనే ఉన్న చెట్లకు నిప్పు పెట్టడంతో కాలిపోతున్నాయి. దీంతో మొక్కల సంరక్షణపై అధికారుల పట్టింపేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



కొమ్మినేపల్లి వననర్సరీలో మొక్కల పెంపకం

పాలకుల హడావుడి..
ప్రతీ సంవత్సరం వన మహోత్సవాన్ని జూన్, జూలైలో నిర్వహిస్తుంటారు. ఈ సమయాన ప్రభుత్వ అధికారులు హడావుడి చేసి తర్వాత పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాలను పచ్చని వాతావరణంతో పాటు ప్రజలకు పచ్చని ఆహ్లాదాన్ని పంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు కొత్త కార్యక్రమాలు తీసుకొస్తున్నా కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వం ఆశయం నీరుగారిపోతుంది. మొక్కలను సంరక్షించడానికి ప్రతీ గ్రామ పంచాయతీకి వాటర్ ట్యాంకర్ కూడా ఉంది. అయినా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

1.20 లక్షల మొక్కల పెంపకం..
మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేసి గత 8 ఏళ్లలో సుమారుగా 3 లక్షల మేర మొక్కలు పెంచి నాటుతున్నారు. మొక్కలు పెంచడం, నాటడానికి ప్రభుత్వం రూ.లక్షల ఖర్చు చేస్తున్నా.. వాటిని సంరక్షించకపోవడంతో రూ.లక్షలు వృథా అవుతున్నాయని వాపోతున్నారు. రహదారుల వెంట నాటిన మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయకపోవడంతో పశువులకు మేతగా మారుతున్నాయి. ఈ ఏడాది మండలంలోని వనన ర్సరీలలో 1.20 లక్షల మొక్కల పెంపకం చేపట్టారు.

పట్టించుకోని ప్రత్యేకాధికారులు..
పంచాయతీలలో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి జీపీలకు ప్రత్యేకాధికారులను నియమించారు. వారు రోజువారీ విధులతో పాటు పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించలేక పోతున్నారు. పంచాయతీలకు ట్రాక్టర్లు ఉన్నా అవి నిరుపయోగంగా మారాయి. ముదురుతున్న ఎండలకు మొక్కలకు నీరు పట్టకుంటే పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నాటడం లక్షల్లో..
హరితహారం, వనమహోత్సవ కార్యక్రమం పేరిట ప్రతీ ఏటా సుమారుగా 3 లక్షల మొక్కలు నాటుతున్నారు. కానీ వాటిని సంరక్షించకపోవడంతో సగభాగం కూడా బతికిన సందర్భాలు లేని పరిస్థితి నెలకొంది. ప్రతీ ఏటా లక్షల్లో మొక్కలు నాటుతున్నారు కానీ సంరక్షణ లేకపోవడంతో వేలల్లోనే బతుకుతున్నాయి. ఇలా ప్రతీ ఏటా మొక్కల సంరక్షణ బాధ్యతలు మరవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది.

మొక్కల సంరక్షణ చేపట్టాలి



ప్రభుత్వం మొక్కల పెంపకంలో సంరక్షణ చర్యలు చేపట్టాలి. అప్పుడే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుంది. మొక్కలు నాటడం, సంరక్షణ అందరి బాధ్యతగా భావించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలి.
– కేసగాని తిరుపతయ్య, కామేపల్లి

చర్యలు తీసుకుంటున్నాం
వననర్సరీల్లో అన్ని రకాల మొక్కల పెంపకాన్ని చేపట్టాం. నాటిన మొక్కలను సంరక్షించేలా జీపీల అధికారులకు బాధ్యతలు అప్పగించాం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. మొక్కల సంరక్షణకు ప్రజలంతా సహకారం అందించాలి.
– రవీందర్, ఎంపీడీఓ కామేపల్లి

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయడం ఎంత ముఖ్యమో నాణ్యత పాటించడం కూడా అంతే ప్రధానమని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం 46వ డివిజన్ జూబ్లీపురలో రూ.33.95 లక్షలతో నిర్మించే సీసీ డ్రెయిన్లు, కల్వర్టు పనులకు మంత్రి మంగళవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. నగరాన్ని ప్రణాళికాయుతంగా అభివృద్ధి చేస్తున్న నేపథ్యాన అధికారులకు ప్రజలు సహకరించాలని సూచించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, కార్పొరేటర్ కన్నం వైష్ణవి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా ఆధ్వర్యాన నగర వర్తక సంఘం బాధ్యులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా కమాన్ బజార్ రోడ్డు విస్తరణ, కమాన్ బజార్ మధ్య గేట్ వద్ద ఆర్‌ఓబీ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

రెండో రోజూ కొనసాగిన నిరసన



ఎంసీహెచ్ షెడ్‌లో బైఠాయించిన కార్మికులు



ఆస్పత్రిలో పేరుకుపోయిన చెత్త, మెడికల్ వ్యర్థాలు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో కార్మికులు విధులు బహిష్కరించగా, వారి ఆందోళన రెండో రోజైన మంగళవారం కూడా కొనసాగింది. పెద్దాస్పత్రిలోని పేషంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది మూడు నెలల జీతం చెల్లిస్తేనే విధుల్లోకి వస్తామని స్పష్టం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓ బి.రాంబాబు ఇప్పుడు ఒక నెల, వారంలోగా మిగతా రెండు నెలల వేతనం చెల్లిస్తామని చెప్పినా ససేమిరా అన్నారు. వేతనాల చెల్లింపులో నెలల తరబడి జాప్యంతోకుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. కాగా, కార్మికుల నిరసనతో ఆస్పత్రిలో చెత్తాచెదారం పేరుకుపోగా దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో మున్సిపల్ కార్మికులను రప్పించినా కార్మికులు వారిని అడ్డుకున్నారు.

గాలి దుమారం.. ఆగమాగం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో మంగళవారం సాయంత్రం వీచిన గాలిదుమారంతో కురిసిన వర్షానికి పలు డివిజన్లలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. చెట్లు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ వైర్లు తెగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈనేపథ్యాన 53వ డివిజన్‌లో ఓ కారుపై చెట్టు విరిగి స్వల్పంగా దెబ్బతింది. అదే డివిజన్‌లో ఓ ఇంటిపైకి చెట్టు ఒరగగా చెట్టు పక్కనే ఉన్న బండరాయి అడ్డుగా ఉండడంతో ప్రమాదం తప్పింది. కేఎంసీ డీఆర్‌ఎఫ్ సిబ్బంది కూలిన చెట్లను తొలగించారు.

అండర్ రైల్వే బ్రిడ్జి
ఖమ్మంరాపర్తినగర్: మామిళ్లగూడెంలో ఇటీవల నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. చిన్న వర్షానికే బ్రిడ్జి నిండిపోతే వర్షాకాలంలో మా పరిస్థితి ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. అలాగే మామిళ్లగూడెంలోని గ్రామీణ బ్యాంకు వద్ద రోడ్డుపై రోడ్డు నిలిచి కనీసం నడిచేందుకు వీలు లేకుండా పోయింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం
ఖమ్మంఅర్బన్: ఈదురుగాలు, వర్షంతో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు కూలిపడడంతో సరఫరా నిలిచిపోయింది. ఖానాపురం సబ్‌స్టేషన్ నుంచి రోటరీనగర్–టేకులపల్లి సబ్‌స్టేషన్ వరకు ఉన్న 33/11 కేవీ విద్యుత్ తీగ తెగగా, సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇంకొన్ని కాలనీలతో పాటురఘునాథపాలెం మండలం కోటపాడులోనూ అదే పరిస్థితి ఎదురైంది. ఈమేరకు విద్యుత్ ఉద్యోగులు మరమ్మతుల్లో నిమగ్నమయ్యారు.



రోడ్డుపై కూలిన చెట్లను తొలగిస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది



ఖమ్మం అర్బన్ : ప్రశాంతినగర్‌లో మరమ్మతులు



మామిళ్లగూడెం బ్రిడ్జి కింద నిలిచిన వర్షపునీరు



ఐటీ హబ్ సెంటర్‌లో పొంగుతున్న డ్రెయినేజీ

కార్మికుల హాజరుపై ఆరా..

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలకసంస్థ పరిధిలో పని చేసే రెగ్యులర్ కార్మికుల హాజరుపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ నెల 5న 'సాక్షి'లో 'విధులు నిర్వర్తించకుండానే హాజర్లు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు మంగళవారం రెగ్యులర్ వర్కర్లను కేఎంసీ కార్యాలయానికి రప్పించారు. మొత్తం 92 మందిని రమ్మని ఆదేశించగా.. 60 మంది వరకు హాజరైనట్లు తెలిసింది. ఈనేపథ్యాన ఎవరు ఎక్కడ పని చేస్తున్నారు..? ఏం పని చేస్తున్నారని అధికారులు వారిని ప్రశ్నించినట్లు తెలిసింది. పారిశుద్ధ్య పనులు చేయలేని కార్మికులు ఎవరెవరు ఉన్నారని తెలుసుకున్నారు. బుధవారం కూడా మరికొందరిని విచారించనున్నట్లు తెలిసింది.

9 నుంచి బ్రహ్మోత్సవాలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని స్వయంభు ప్రాచీన దివ్యక్షేత్రం శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం(గుట్ట)లో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు వార్షిక పంచాహ్నిక బ్రహ్మోత్సవ, శ్రీ సుదర్శన యాగ, కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్ రావు తెలిపారు. వైశాఖ శుద్ధ ద్వాదశి శుక్రవారం ఉదయం 5:30 గంటలకు ఉత్సవాలు ప్రారంభమై 13వ తేదీ వసంతోత్సవం, ద్వాదశ ప్రదక్షిణలు, ఊంజల్ సేవ వంటి కార్యక్రమాలతో ముగుస్తుందని, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నేలకొండపల్లి: ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో ఉద్యమించాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూక హనుమంతరావు పిలుపునిచ్చారు. మండలంలోని బైరవునిపల్లిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడిగా లక్ష్మయ్య, కార్యదర్శిగా మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా నాగభూషణం, పి.నాగేశ్వరరావు, పి.శ్రీను, వీరయ్య, ఎం.నాగేశ్వరరావు, పుల్లయ్య, గోవిందరావు, లక్ష్మీనారాయణ, నాగరాజు, బద్రి,వీరబాబు, వెంకటేశ్వర్లు, గంగయ్య తదితరులను ఎన్నుకున్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి

తిరుమలాయపాలెం: అమరుల ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ అన్నారు. మంగళవారం మండలంలోని హైదర్‌సాయిపేట గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు చింతోజు వెంకటాచారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన స్మారక స్థూపాన్ని ఆవిష్కరించి నివాళులర్పించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బషీరుద్దీన్, మండల కార్యదర్శి శ్రీను, నాయకులు దాసరి మహేందర్, మట్టా సుధాకర్, పుసులూరి వీరభద్రం, వెంకన్న, మందడి ఆనందరావు, భూక్య వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- హామీలకు మించి అభివృద్ధి పనులు
- భగీరథ సమస్యలను పరిష్కరిస్తున్నాం

నగర మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: 'అభివృద్ధిలో రాజకీయాలకు తావుండదు. ఎన్నికల వరకే రాజకీయాలు, ఏ పార్టీ కార్పొరేటర్ ఉన్నా డివిజన్లలో అభివృద్ధి పనులు కొనసాగుతాయి. మేము కార్పొరేషన్ పరిధిలో ఇచ్చిన హామీల కన్నా ఎక్కువగానే అమలు చేశాం. మిషన్ భగీరథ పథకం కింద లక్ష్యం కన్నా ఎక్కువగానే మంజూరు తీసుకుని కనెక్షన్లు ఇచ్చాం. ఈ పథకంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నాం' అని నగర మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. మేయర్ పదవి చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన వివరాలు ఆమె మాటల్లోనే..

అన్ని డివిజన్లు సమానమే..
నగరంలోని 60 డివిజన్ల అభివృద్ధికి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఏ పనులకు టెండర్లు పిలవలేదు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ప్రతీ డివిజన్‌కు రూ.25 లక్షల టీయూడీఎఫ్ నిధులు రాగా టెండర్లు పిలిచి పనులు నిర్వహిస్తున్నాం. పబ్లిక్ హెల్త్ కింద కూడా పనులు నిర్వహిస్తున్నాం. రోడ్లు, డ్రెయినేజీల పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయి.

ప్రజా అవసరాల మేరకు..
డివిజన్ ప్రజల అవసరాలను తెలుసుకుంటూ పనులను పూర్తి చేస్తున్నాం. అయితే కార్పొరేషన్‌లో ఎప్పటికీ పనులు పూర్తయినట్లు ఉండదు. కొత్తగా కాలనీలు, పెరుగుతూ వస్తాయి. కొత్త సమస్యలు పుట్టుకొస్తూనే ఉంటాయి. ఎన్ని పనులు చేసినా ఇంకా అవసరం ఉంటూనే ఉంటుంది.

భగీరథ సమస్యలు పరిష్కరిస్తున్నాం..
మిషన్ భగీరథ కింద అన్ని ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చాం. ఇప్పుడు కూడా పనులు మంజూరయ్యాయి. అయితే ఇళ్లు ఖాళీగా ఉన్న ప్లాట్లకు కూడా కనెక్షన్లు ఇవ్వడంతో నీరు వృథాగా పోతోందని చెబుతున్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తున్నాం. గతంలో కార్పొరేషన్ పరిధిలోనే మిషన్ భగీరథ ఉండగా.. ఇప్పుడు మిషన్ భగీరథ అధికారికి అప్పగించాం.

అందరి సహకారంతోనే..
అందరి సహకారంతో కార్పొరేషన్ మేయర్‌గా నాలుగేళ్లు పని చేయగలిగాను. అధికారులు, కార్పొరేటర్లు, మంత్రుల సహకారం బాగుంది. మున్సిపాలిటీల్లో విధులు ఎంత నిర్వర్తించినా.. ఇంకా చేయలేదనే వారే అధికంగా ఉంటారు.

పూడికతీత పనులు వేగవంతం చేయాలి



అంగన్‌వాడీ టీచర్‌తో మాట్లాడుతున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: లకారం ట్యాంక్‌బండ్, తుమ్మలగడ్డ, చెరువుబజార్ ప్రాంతాల మీదుగా ప్రవహించే స్టోమ్ వాటర్ డ్రెయినేజీ పూడికతీత పనులను సకాలంలో పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. మంగళవారం నగరంలోని 41వ డివిజన్‌లో లకారం ట్యాంక్‌బండ్ స్టోమ్ వాటర్ డ్రెయిన్ పూడికతీత పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రెయినేజీలో పూడిక తీయడంతో పాటు పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలన్నారు. వర్షాకాలం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

అంగన్‌వాడీ సందర్శన..
41వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రాన్ని కమిషనర్ సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. కేంద్రానికి ఏమైనా అవసరాలు ఉన్నాయా.. అని ఆరా తీసి సౌకర్యాల మెరుగుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, ఎస్‌ఈ రంజిత్, ఈఈ కృష్ణాలాల్, ఏసీపీ వసుందర తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సుధాకర్

నేలకొండపల్లి: ఉపాధి హామీ పథకం పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో మంగళవారం ఉపాధి పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రోజువారి కూలీ ప్రభుత్వం రూ.307 అందిస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో కనీసం రూ.100 కూడా పడడం లేదని కూలీలు వాపోతున్నారన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా పని వేళలలో మార్పులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లెబోయిన గోవిందరావు, కల్యాణం నాగేశ్వరరావు, బాజా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర జెండా ఆవిష్కరణ

రఘునాథపాలెం: ప్రపంచ కార్మికుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మంగళవారం మండలంలోని మంచుకొండ గ్రామంలో ఉపాధి హామీ పర్యటనలో భాగంగా దళిత నాయకుడు ఎర్రజెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగిస్తూ కార్మికుల చరిత్రలో ఎర్రజెండాకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు.ఉపాధి కూలీలకు రోజువారి వేతనం కనీసం రూ.600 ఇవ్వాలని, పని ప్రదేశాల్లో తాగు నీరు, టెంట్లు, పారలు, గడ్డపారలు అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ మంగమ్మ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

జయప్రదం చేయండి

- **రేపటి డిమాండ్స్ డే కార్యక్రమాన్ని..**

రఘునాథపాలెం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై నిరసనగా ఈ నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించే డిమాండ్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐయుకేఎస్ జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండలంలోని వేపకుట్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.పంటలకు కనీస మద్దతు ధరను చట్టబద్ధత కల్పించాలని, కొత్త వ్యవసాయ రుణాలుఇవ్వాలని, పోడు భూములకు హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు గుణగంటి వీరబాబు, మేక రామనాథం, పి.నరసయ్య, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- **30న లెక్టరేట్ ముట్టడిని..**

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల 30న వ్యవసాయ కార్మిక సమస్యలపై నిర్వహించే కలెక్టర్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు కోరారు. మంగళవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం పని రోజులు 200కు పెంచాలని, బడ్జెట్‌లో రూ.2.50లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సంఘం నేతలు నున్నా నాగేశ్వరరావు, బుర్రి ప్రసాద్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కృష్ణ, జానకిరాములు, కేవీ రెడ్డి, టి.రాధాకృష్ణ, రత్తమ్మ, సంగయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

నడి రోడ్డుపై వ్యర్థాలు..



మండలంలోని పైనంపల్లి టోల్‌గేట్ సమీపాన చికెన్ వ్యర్థాలు నడిరోడ్డుపై దర్శనమిచ్చాయి. చెరువులో చేపల మేత కోసం హైదరాబాద్ నుంచి రాజమండ్రికి కంటైనర్‌లో తరలిస్తున్న దాదాపు 50 బస్తాల వ్యర్థాల వరకు సోమవారం అర్ధరాత్రి సమయాన కనిపించాయి. లారీలో తరలిస్తుండగా జారిపడి ఉండొచ్చని భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న వ్యర్థాల కాంట్రాక్టర్ కోదాడ నుంచి ఓ వాహనంలో తరలించేందుకు ఘటనా స్థలానికి కొంతమందితో రాగా వాసన భరించలేక వెనుదిరిగారు. ఈనేపథ్యాన కంపు భరించలేక పలువురు వాహనదారులు టోల్‌గేట్, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు మండిపడ్డారు. – నేలకొండపల్లి